ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

ఆదివారం 16 నవంబరు 2025

విద్యార్థులకు ఉచిత నృత్య శిక్షణ

జగిత్యాల అర్బన్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగే వేడుకల్లో వంద మంది విద్యార్థులకు ఉచిత నాట్య శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రముఖ నాట్యాచారులు మేదిని లలిత కళా క్షేత్రం నిర్వాహకులు భుజంగరావు తెలిపారు. గణతంత్ర దినోత్సవంలో పాల్గొనే వంద మంది విద్యార్థులకు శాస్త్రీయ నాట్యం పేరిణిలో శిక్షణ ఇస్తామని, సర్టిఫికేట్లు అందజేస్తామని తెలిపారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులు 944 1132186 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆయిల్‌పాం పంటల సాగుపై దృష్టి సారించాలి

కథలాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫాం పంటల సాగు విస్తీర్ణం పెంచుకోవాలని ఉద్యాన శాఖ విస్తీర్ణాధికారి అన్వేష్ కోరారు. మండలంలోని గంభీర్‌పూర్, చింతకుంట గ్రామాల్లో శనివారం ఆయిల్‌ఫాం సాగుపై రైతులకు వ్యవసాయ, సహకార శాఖల ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం పెద్దఎత్తున సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నందు వల్ల రైతులు సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ పంటలపై చీడ పీడల ఉధృతి ఉండదని, కోతుల సమస్య కూడా ఎదురుకాదన్నారు. అంతర పంటలుగా కోకో, వక్క వంటి పంటలు వేసుకుని అధిక ఆదాయం పొందవచ్చని అన్నారు. ఫీల్డ్ ఆఫీసర్, సీఈఓలు అరుణ్, విజయ్, ఏఈఓ హరీశ్, రైతులు ఉన్నారు.

బాడీ బిల్డర్‌కు సన్మానం

కథలాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూలూరుకు చెందిన మిట్టపల్లి అభిరాం సౌత్ ఇండియా స్థాయి మిస్ అండ్ మిస్టర్ బాడీ బిల్డర్ పోటీలకు ఎంపిక కాగా శనివారం గ్రామస్థులు సన్మానించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 55 కేజీల విభాగంలో జరిగిన పోటీల్లో అభిరాం ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 2026లో చెన్నైలో జరగనున్న పోటీలకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా గోపిడి ధనుం జయ్‌రెడ్డి, రాజు, గంగారెడ్డి, అంజయ్య, రాజేందర్, రవి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సర్వేకు సన్నద్ధం..



- జిల్లాలో జల వనరుల గణనకు కసరత్తు
- తేలనున్న చెరువులు, కుంటలు, వ్యవసాయ బావుల లెక్క
- రేపటి నుంచి నెల రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- సమగ్ర వివరాలు యాప్‌లో నమోదు

జగిత్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిన్న నీటి వనరుల లెక్కింపునకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ప్రతీ ఐదేళ్లకు ఒకసారి లెక్కించాల్సిన నీటి వనరుల గణన కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయింది. ప్రస్తుతం ఆరవ జాతీయ జల వనరుల గణనను నిర్వహించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం ఇప్పటికే ఖరారు చేసింది. ఈనెల 17 నుంచి ఈ ప్రక్రియ మొదలు కానుంది. భారత ప్రభుత్వ పరిధిలోని జలశక్తి కార్యక్రమంలో భాగంగా జల గణన చేపడుతున్నారు. మ్యానువల్ పద్ధతిలో నీటి వనరులను లెక్కపెట్టి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తారు.



ధర్మపురి శివారులో నిండిన అక్కనపల్లి చెరువు

బావులు, చెరువులు, కుంటల గణన..

భారత ప్రభుత్వ పరిధిలోని జలశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఐదేళ్లకు ఒకసారి చిన్న నీటి వనరులను లెక్కించాల్సి ఉంటుంది. అయితే పలు కారణాల వల్ల ఇరవై సంవత్సరాలుగా జల వనరుల గణన జరగలేదని సంబంధిత అధికార వర్గాలు అంటున్నాయి. ఈనెల 17 నుంచి చేపట్టేందుకు సీపీవో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా గొట్టపు బావులు, ఓపెన్ బావులు, చెరువులు, చిన్నపాటి కుంటలు, 2 వేల హెక్టార్లలోపు భూమికి సాగు నీరు అందించే మినీ ప్రాజెక్టులను లెక్కించనున్నారు. అధికారులు వీటన్నింటి వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి అందిస్తారు. ఈ గణన ద్వారా ఏయే గ్రామంలో ఎన్ని నీటి వనరులు ఉన్నాయనే విషయంతో పాటు గ్రామాల్లో నీటి లభ్యత ఎలా ఉందనే అంశం వెలుగులోకి రానుంది. గణన వివరాలను కేంద్ర జలశక్తి శాఖకు అందించనున్నారు. అధికారులు అందించిన ఈ నివేదిక ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం భవిష్యత్‌లో రాష్ట్ర నీటి

మిగతా 8లో..

జిల్లాలో 60 వేలకు పైగా...

జిల్లాలో గతంలో చేపట్టిన నీటి వనరుల గణన ప్రకారం వ్యవసాయ బోర్లు, బావులు, చెరువులు, కుంటలు అన్ని కలిపి సుమారు 60 వేలకు పైగా ఉన్నట్లు అధికారులు అంటున్నారు. ప్రస్తుతం నీటి వనరుల లెక్కలు తేల్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మండల స్థాయిలో సిబ్బందికి శిక్షణ పూర్తయిన వెంటనే క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంతో పోలిస్తే ఈ ఐదేళ్లలో బోరుబావుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. సాగునీటి రంగానికి ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో పాటు రైతులు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేస్తున్నారు. గతంలో మాదిరిగా బావులను తవ్వకుండా బోరు బావుల ఆధారంగా వ్యవసాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు బోరుబావులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ఈసారి బావుల సంఖ్య తగ్గి, బోరు బావుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

గణనకు ఏర్పాట్లు చేశాం

గుగ్గిళ్ల సత్యం, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, జగిత్యాల



చిన్న నీటి వనరుల గణన గురువారం నుంచి జిల్లాలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందుకు సంబంధించి మూడు రోజులు పాటు సిబ్బందికి శిక్షణ అందించ నున్నాం. నెల రోజుల్లో నీటి వనరుల గణన పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం.

పోరాట యోధుడు బిర్సా ముండా

అదనపు కలెక్టర్ బీఎస్ లత



బిర్సా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా ఎదురొడ్డి పోరాడిన గొప్ప యోధుడు బిర్సా ముండా అని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శనివారం బిర్సా ముండా జయంతి సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడారు. బ్రిటిష్ పాలకులు, స్థానిక భూస్వాములు గిరిజనుల భూములు ఆక్రమించి అనేక దురాగతాలకు పాల్పడుతున్న రోజుల్లో బిర్సా ముండా నాటి సామాజిక ఆర్థిక అన్యాయాన్ని ఎదిరించి నిలిచారని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడారన్నారు. బ్రిటిష్ అరాచక శక్తులపై జరిగిన ఒక గొప్ప తిరుగుబాటుకు నాయకత్వం వహించారని స్మరించారు. భగవాన్ బిర్సా అడవి బిడ్డలు తమ భూమిని తామే సాగు చేసుకునే హక్కు కోసం, గిరిజన జాతుల ఆచారాలు, సాంఘిక విలువల గౌరవం తీసుకురావడం కోసం పోరాడినందుకు కేంద్ర ప్రభుత్వం ఆయన స్మారకంగా 2021 నవంబరు 15వ తేదీన జాతీయ గౌరవ దివస్‌గా భారత ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..: కోరుట్ల సీఐ సురేష్ బాబు



మాట్లాడుతున్న సీఐ సురేష్‌బాబు

కోరుట్ల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు అన్నారు. శనివారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాల పోలాస వారి అధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సేవ పథకం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో జరిగే అనర్థాలు, సైబర్ నేరాల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కోరుట్ల సీఐ సురేష్ బాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ బాబు మాట్లాడారు. సైబర్ నేరంకు మోసం పోయినట్లు గుర్తిస్తే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరాల్లో మోసపోయిన వారి గురించి వివరించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరాలపై రూపొందించిన చట్టాలను వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ కళాబృందాలచే మత్తు పదార్థాలు సేవించడంతో వచ్చె అనర్థాలపై నృత్య ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల రెండవ ఎస్ఐ రామచంద్రుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంతం రాజం, టీఆర్ఎస్ నాయకుడు సందయ్యలతో పాటు పొలాస స్థాన కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీ బాలికల వసతి గృహంలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి బండారి మధు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 17, 18 తేదీల్లో కేజీబీవీ పాఠశాలలో దరకాస్తులు సమర్పించాలని ఆయన కోరారు. ఇందులో చౌకీదార్‌కు 10వ తరగతి అర్హత, అసిస్టెంట్ కుక్‌కు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వారు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

వాచ్‌మన్, ఏఎన్‌ఎం పోస్టులకు..

కోరుట్ల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలంలోని కల్లూర్ మోడల్ స్కూల్‌లోని వసతి గృహంలో చౌకిదార్ (నైట్ వాచ్‌మన్), ఏఎన్‌ఎం పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రజిత శనివారం తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో ఈ నెల 17, 18 తేదీలలో ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాని సూచించారు. నైట్ వాచ్‌మన్ మహిళలు అర్హులని వారు 10వ తరగతి ఉతీర్ణత అయి 55 సంవత్సరాల నిండి ఉండాలని తెలిపారు. ఏఎన్‌ఎం ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఏఎన్‌ఎం శిక్షణ పొంది ఉండాలని తెలిపారు.

ఏఎన్‌ఎం పోస్టుకు..

జగిత్యాలరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్ నందు ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల రూరల్ మండల విద్యాధికారి గంగాధర్ తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన వారు ఇంటర్మీడియట్‌లో 45 శాతం, ఏఎన్‌ఎం ట్రైనింగ్‌లో 45శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అదనపు అర్హతలుగా జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ ట్రైనింగ్ పొందినవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈనెల 18 లోపు జగిత్యాల దరూర్ క్యాంపులో గల కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలని ఎంఈవో తెలిపారు.

నాన్ టీచింగ్ పోస్టుకు..

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన పని చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి అసిస్టెంట్ కుక్ (వంట మనిషి) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సీతాలక్ష్మి, ప్రత్యేక అధికారి వి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో నవంబరు 17 నుంచి 18 వరకు సాయంత్రం 5 గంటల లోపుగా దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు. అసిస్టెంట్ కుక్ కోసం 7 వ తరగతి వరకు చదివి, వయస్సు 18 నుండి 45 సంవత్సరాల లోపుగా ఉండాలని వారు తెలిపారు.

రాజీ మార్గమే రాజ మార్గం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి

స్పెషల్ లోక్ అదాలత్‌లో ఏకమైన నాలుగు జంటలు

1,579 కేసుల పరిష్కారం

జగిత్యాల టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి అన్నారు.



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి

కేసుల్లో కోర్టుల చుట్టూ తిరిగితే డబ్బు, సమయం వృథా అవుతుందని అన్నారు. జిల్లా కోర్టులో శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 1579 వివిధ కేసుల్లో రాజీ కుదరగా మోటర్ వాహనాలకు సంబంధించిన కేసులో బాధితులకు బీమా కంపెనీలు రూ.29 లక్షల నష్టపరిహారాన్ని అందించాయి. వరకట్నం, విడాకులు తదితర భార్యభర్తల కేసుల్లో నాలుగు జంటలు మళ్లీ ఏకమయ్యాయి. దంపతులైన వేముల లావణ్య - మధు, తీపిరెడ్డి సుమలత- చంద్రశేఖర్‌రెడ్డి, అవుదారి శిరిష-శ్రీనివాస్, కొత్తూరి మానస- ప్రశాంత్‌లు న్యాయమూర్తి సమక్షంలో మరోసారి దండలు మార్చుకొని కలిసిపోయారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి మాట్లా డుతూ కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకుంటే డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. కొట్లాటలు, కుటుంబ తగాదాలతో వచ్చేది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ, సబ్ జడ్జి వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ, జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌లు లావణ్య, శ్రీనిజ, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో డిప్యూటీ సెక్రెటరీ తనిఖీ

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాల మేరకు డిప్యూటీ సెక్రెటరీ సుందర్ రాఘవ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కళాశాల రికార్డులను పరిశీలించి, లెక్చరర్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధితో పాటు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు పలు సూచనలు చేశారు. కళాశాలలో అదపు తరగతి గదుల అత్యవసర ఏర్పాటు గురించి అధికారులకు నివేదిక సమర్పిస్తానన్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ దాసరి నాగభూషణం , కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీ ఆక్రోశ సభకు తరలిన నాయకులు

జగిత్యాల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో నిర్వహిస్తున్న బీసీ ఆక్రోశ సభకు జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి బీసీ జేఏసీ నాయకులు, వివిధ కులసంఘాల నాయకులు శనివారం తరలివెళ్లారు. మాజి కౌన్సిలర్ అడువాల లక్ష్మణ్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలు అయ్యే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మానాల కిషన్, ప్రధాన కార్యదర్శి పడాల శ్రీనివాస్, కార్యదర్శి నలూరి రాజుగౌడ్, పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీకాంత్ గౌడ్, గంగిపల్లి శేఖర్, వేణుమాధవ్, పెండం గంగాధర్, ముత్యాల గంగాధర్, మల్లన్న, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడం లేదని ఆందోళన

- తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి వెళ్లేందుకు మహిళల యత్నం
- అడ్డుకున్న పోలీసులు



డబుల్ బెడ్‌రూం ఇళ్ల తాళాలు పగలగొడుతున్న మహిళలు

జగిత్యాల టౌన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లు పొందేందుకు తమకు అర్హత ఉన్నా అధికారులు కేటాయించలేదని పలువురు మహిళలు నూకపల్లి అర్బన్ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల తాళాలను శనివారం పగుల గొట్టి ఆందోళన చేశారు. జగిత్యాలలో గత ప్రభుత్వం నూకపల్లి అర్బన్ కాలనీలో 4,520 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేసింది. అధికారులు పలు దఫాలుగా లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తున్నారు. శనివారం కలెక్టరేట్‌లో మూడో విడతలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ స్పందనలు 520 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. ఎంపిక కాని పలువురు మహిళలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం నూకపల్లి అర్బన్ కాలనీలో ఖాళీగా ఉన్న పలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల తాళాలు పగుల గొట్టారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పోలీసులు నచ్చచెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ బి.సత్యప్రసాద్



పెగడపల్లిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్

పెగడపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొను గోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదే శించారు. శనివారం పెగడపల్లి మండల కేంద్రంతో పాటు బతికెపల్లి గ్రామాల్లోని పెగడపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలలో నిల్వలు, తూకం వేసిన ధాన్యం సంచులను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, పెగడపల్లి తహసీల్దార్ ఆనంద్ కుమార్, మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్, గిర్దావర్ శ్రీనివాస్, విండో సీఈఓ తడకమడ్ల గోపాల్‌రెడ్డి, ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

గొల్లపల్లి: ధాన్యం విక్రయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం గొల్లపల్లి ఏఎంసీలో కొనసాగుతున్న వరి ధాన్యం విక్రయాలను, మండలంలోని రాపల్లె గ్రామంలో జరుగుతున్న వరి ధాన్యం విక్రయాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎంసీలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోళ్లలో భాగంగా ఎలక్ట్రానిక్ కాంటాకు వేసిన వరి ధాన్యం బస్తా తూకంను తనిఖీ చేశారు. డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీసీవో మనోజ్ కుమార్, తహసీల్దార్ మాజీద్, ఏవో బొట్ల కరుణ, ఏఎంసీ కార్యదర్శి అల్లె వరలక్ష్మీ, సింగిల్‌విండో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


జయసింహారెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడని ఎస్సై సీహెచ్‌గణేశ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. ఆవునూర్ గ్రామానికి చెందిన బద్ది జయసింహారెడ్డి(65) అనేరైతు తన వ్యవసాయపొలం వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు బోర్‌మోటార్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కొడుకు భానుచందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఒకరి మృతి


సరేందర్(ఫైల్)

జమ్మికుంట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన గుల్లి సరేందర్ (50) ప్రమాదవశాత్తు రైలు కింద పడి శనివారం మృత్యువాత పడ్డాడు. సరేందర్ సుతారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం పక్షవాతం రాగా, కొద్ది నెలల క్రితం తిరిగి కోలుకున్నాడు. ప్రస్తుతం సుతారి పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా మడిపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గం మధ్యలో ఉన్న రైల్వేగేట్ వద్ద ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

బాలిక ఆకస్మిక మృతి


రెడ్డి అర్చన(ఫైల్)

సైదాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలం సర్వాయిపేట పంచాయతీ పరిధిలోని శివరాంపల్లిలో రెడ్డి అర్చన (16) ఆకస్మికంగా మృతిచెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివరాంపల్లికి చెందిన అర్చన సోమారం మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్ర వారం సాయంత్రం తల్లిదండ్రులతో సరదాగా గడిపి రాత్రి నిద్ర పోయిన అర్చన ఉదయం లేచేసరికి మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అర్చన తండ్రి రెడ్డి రాజు ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టుతో బాలిక మృతి కారణం తెలిసే అవకాశం ఉంది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో శిక్ష పడుతుందని యువకుడి బలవన్మరణం


సూర విజయ్(ఫైల్)

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌కేసులో శిక్ష పడుతుందనే భయంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేష్‌రెడ్డి, విజయ్ తల్లి ఫిర్యాదు మేరకు... చొప్పదండి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సూరవిజయ్(28) చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. విజయ్‌కి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈనెల 1న చొప్పదండి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌తనిఖీలు చేస్తుండగా విజయ్ పట్టుబడ్డాడు. విజయ్‌పై కేసు పెట్టిన పోలీసులు శుక్రవారం కోర్టుకు తీసుకెళ్లారు. మేజిస్ట్రేట్ సెలువులో ఉండడంతో విజయ్‌తిరిగి ఇంటికి వచ్చాడు. వచ్చిన తర్వాత కేసులో శిక్ష పడుతుందని, ఫైన్ కట్టడానికి డబ్బులు లేవని భార్యతోవిజయ్ చెప్పాడు. మనస్తాపం చెందిన విజయ్ శనివారం ఉదయం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విజయ్‌తల్లి నాగమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి టిప్పర్ బోల్తా

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల-రాగట్లపల్లి గ్రామాల మధ్య రహదారిలో అదుపుతప్పి టిప్పర్ వ్యవసాయ పొలంలో బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇక్కట్లు

● ఇసుక, కంకర ధరల పెరుగుదల


హుజూరాబాద్‌లో ఇసుక లేక మధ్యలోనే వదిలేసిన ఇందిరమ్మ ఇంటి పనులు



హుజూరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇసుక, కంకర ధరలు పెరగడం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో కొందరు ఇళ్ల నిర్మాణ పనులు నిలిపివేశారు. రెండు నెలలుగా ఇసుక, కంకర ధరలను వ్యాపారులు ఇష్టానుసారంగా పెంచేశారు.ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా రులకు చేసిన ఇళ్ల నిర్మాణాల ఆధారంగా డబ్బులు జమ చేసింది. ఆ డబ్బులు సరిపోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

హుజూ రాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట,వీణవంక మండలాల్లో మానేరు వాగు ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు వాగు ప్రవ హించడంతో ఇసుక దొరకడం లేదు. దొరికిన ఇసుక ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున దోపిడీ చేస్తున్నారు. దళారులే ధరలు పెంచుతు న్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. హు జూరాబాద్ నియోజకవర్గంలో జమ్మి కుంట, ఇల్లందకుంట, వీణవంక, హుజూరాబాద్, కమలాపూర్ మండలాలు ఉండగా, అందు లో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యా యి. ఆరునెలల క్రితం ట్రాక్టర్ ఇసుక రూ.2800నుంచి రూ.3వేల వరకు లభిం చింది. అంతేకాకుండా గృహ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుండడంతో క్రషర్ యజమానులు కంకర ధరలను కూడా పెంచేశారు. ఓ వైపు కంకర, మరో వైపు ఇసుక ధరలు పెంచడంతో సామా న్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక, కంకర దళారులను అరికట్టడంలో రెవెన్యూ, పోలీసులు విఫలమయ్యారనే ఆరోపిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసు కను ఉచితంగా లేదా రాయితీపై అందించాల్సి ఉండగా పట్టించుకోవడ లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక, కంకరను ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టేపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 12ట్రాక్టర్లను శనివారం రెవెన్యూసిబ్బంది, పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలం నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతోపాటు పలు గృహాల నిర్మాణాలకు ఈ ప్రాంతంలోని మానేరువాగు నుంచి ఇసుకను ఉచితంగా ట్రాక్టర్ల ద్వారా రవాణాచేయడానికి అనుమతి ఉంది. ఉదయం8నుంచి సాయంత్రం 5గంటల వరకు మానేరువాగు నుంచి ఇసుక ట్రాక్టర్లు రవాణా చేయాల్సి ఉండగా, నిబంధనలకు వ్యతిరేకంగా తెల్లవారుజాము నుంచే ఇసుకను తరలిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను కొన్నిచోట్ల డంప్‌చేసి, అధికధరలకు విక్రయించుకుంటూసొమ్ము చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్రమంగా ఇసుకతరలిస్తున్న 12ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ వినోద్ తెలిపారు.


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 20మందికి గాయాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..



లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ప్రమాద స్థలంలో రోదిస్తున్న మహిళ

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

మానకొండూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద ఆర్టీసీ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో 15మంది ప్రయాణికులు గాయపడ్డారు. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం నిజామాబాద్ నుంచి వరంగల్‌కు బయల్దేరింది. మానకొండూర్ మండలంలోని సదాశివపల్లి బస్టాండ్ వద్ద కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ బ్రేక్ వేయడంతో వెనక నుంచి ఆర్టీసీ బస్సు దానిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో సీట్లలో కూర్చున్న 15మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డవారిలో నిజామాబాద్, జగిత్యాల, హుజూరాబాద్, వరంగల్ జిల్లాల ప్రయాణికులు ఉన్నారు. ఘటనలో బస్సు డ్రైవర్ వైపు ఉన్న అద్దం పగిలిపోయింది. ప్రమాదానికి గురైన బస్సును, లారీని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు వేగంగా వెళ్లవద్దని బస్సు డ్రైవర్‌కు సూచించినా పట్టించుకోలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటో ట్రాలీ బోల్తా పడి..

జమ్మికుంట : జమ్మికుంట మండలం తనుగుల శివారులో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటో ట్రాలీ శనివారం ప్రమాదవశాత్తు బోల్తాపడింది. వీణవంక మండలం ఎల్బాక గ్రామానికిచెందిన 25మంది వ్యవసాయ కూలీలు జమ్మికుంట మండలం నాగారం గ్రామంలో పత్తి ఏరడానికి ఆటోట్రాలీలో ఉదయం ఇంటి నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో తనుగుల శివారులోని గుంపుల క్రాస్‌రోడ్ వద్ద ప్రమాదవశాత్తు ఆటోట్రాలీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడగా, మరో 21మందికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108అంబులెన్స్‌లో జమ్మికుంటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణగౌడ్ ఆసుపత్రికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగినట్లు పోలీస్‌లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి..

ఇల్లంతకుంట : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన కూస అంజిరెడ్డి అనే ద్విచక్ర వాహనదారుడు రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలను ఢీకొని గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపాక గ్రామంలో శనివారం జరిగిన వారసంతకు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ప్రమాదంలో అంజిరెడ్డి గాయపడగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

ఎలిగేడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీ ఎదుట గల చౌరస్తాలో శనివారం ఉదయం ఇసుక ట్రాక్టర్ ఢీకొని పెద్దేల్లి సుధీర్(50) మృతిచెందినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన సుధీర్ గర్రెపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీగా ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా సుల్తాన్‌పూర్‌లో ఎదురుగా అతివేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధీర్ ఛాతిపై నుంచి ట్రాక్టర్ వెనుకటైర్లు వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ శశికుమార్ అజాగ్రత్తగా వేగంగా నడపడం వల్లే ఈ దుర్ఘటన జరిగినట్లు ఆయన తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించగా, మృతుడి భార్య పెద్దేల్లి ఉమా ఫిర్యాదుమేరకు డ్రైవర్ శశికుమార్, యజ మాని ఆవుల సంపత్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని ఒకరి మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామశివారులో శుక్రవారం కారు బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న తాటిపల్లి గ్రామానికి చెందిన ఒజ్జల గంగాధర్(55) చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ కథనం ప్రకారం గంగాధర్ తన స్వగ్రామం తాటిపల్లి గ్రామం నుంచి జగిత్యాలకు పనినిమిత్తం బైక్‌మీద వెళ్తుండగా కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన గంగాధర్‌ను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి బంధువు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

దొంగతనాల కేసుల్లో ఆరుగురి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు, రాగితీగ

కరీంనగర్ క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో కొన్ని నెలలుగా రైతులు, ప్రజల ఆస్తులకు నష్టం కలిగించిన, దొంగతనాల కేసులకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీ స్‌కమిషనర్ గౌస్‌ఆలం వివరాలు వెల్లడించారు. చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ చౌరస్తావద్ద శనివారం పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వెళ్తున్న రెండు వాహనాలను తనిఖీచేయగా దొంగతనాలకు సంబంధించి నిందితులను పట్టుకున్నారు. చొప్పదండి, చిగురుమామిడి, మానకొండూర్, గంగాధర, కరీంనగర్‌రూరల్, రామడుగు, ఎల్ఎండీ, దుగ్గొండి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వారు 15దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. కట్టరాంపూర్‌కు చెందిన మనుపాటి శేఖర్, చొప్పదండికి చెందిన మనుపాటి సంజీవ్, బేగంపేటలోని రామగిరికి చెందిన ఉండాటి మహేశ్, ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్‌కు చెందిన బోదాసు కుమార్, కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట్‌కు చెందిన సాగర్ల రంజీత్, చొప్పదండికి చెందిన బొడిగే స్క్రాప్‌వ్యాపారి సంపత్(రిసీవర్)ను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రెండు పికప్ వాహనాలు, ద్విచక్రవాహనం, 3క్వింటాళ్ల కాపర్ వైరు స్వాధీనం చేసుకున్నామని, వాటి మొత్తం విలువ సుమారు రూ.20 లక్షలుగా ఉంటుందని సీపీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. కేసులకు సంబంధించి పరారీలో ఉన్న మిగతా 8మందికోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

● సీపీ అభినందనలు

కరీంనగర్‌రూరల్ ఏసీపీ విజయకుమార్ నేతృత్వంలో కేసులను ఛేదించగా బృందంలోని ప్రదీప్‌కుమార్(సీఐ చొప్పదండి), సంజీవ్ (సీఐ మానకొండూర్), నరేష్ రెడ్డి(ఎస్సై), వంశీకృష్ణ(ఎస్సై గంగాధర) సిబ్బంది అనిల్, రాజ్‌నాయక్, హేమసుందర్, శ్రీనివాస్, హసనొద్దీన్, రవీందర్, సృజన్‌ను సీపీ గౌస్ ఆలం అభినందించారు.

పోలీసుల పేరుతో దోపిడీకి పాల్పడిన నలుగురి అరెస్టు


నిందితులను అరెస్ట్ చూపుతున్న డీసీపీ కరుణాకర్

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాతనేరస్తులు ఒక ముఠాగా ఏర్పడి పోలీసులమంటూ దోపిడికి పాల్పడి అడ్డంగా దొరికిపోయారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగల అరెస్టును చూపారు. డీసీపీ మాట్లాడుతూ రేగడిమద్దికుంటకు చెందిన నాగుల కుమారస్వామి, కాల్వశ్రీరాంపూర్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన తిప్పని రవీందర్, పోవరి శ్యాంరావు, సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌కు చెందిన పురుషోత్తం నాగరాజులు ముఠాగా ఏర్పడ్డారు. వారి అప్పులు తీర్చేందుకు గతంలో మావోయిస్టు పేరుతో డబ్బులు వసూలు చేసిన నాగుల కుమారస్వామి పోలీసుల పేరుతో దోపిడి చేయాలనే ఆలోచన చేశారు. నలుగురిలో ముఠా సభ్యుడైన పురుషోత్తమ నాగరాజు దోపిడీ కోసం గర్రెపల్లిలోని బంధువుల ఇంటినే ఎంచుకున్నారు. నలుగురు కలిసి ఈ నెల10న గర్రెపల్లిలోని సంగం లక్ష్మి ఇంటికి తెల్లవారుజామున చేరుకొన్నారు. తలుపులు తీసిన లక్ష్మితో తాము కరీంనగర్‌కు వన్‌టౌన్ పోలీసులమని, కరీంనగర్‌లో మీ కొడుకు రమేష్ పని చేస్తున్నాడని, అతని యజమాని దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నాడని, అతనికి సంబంధించిన దొంగ నోట్లను ఇంట్లో దాచిన సమాచారం మేరకు ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంట్లో నిద్రపోతున్న రమేష్‌ను లేపి చేతికి బేడీలను వేసి బీరువా తీయాలని బెదిరించి అందులోని బ్యాగును తీసుకొని, బంగారం, వెండి, నగదును తీసుకొని వెళుతూ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రావాలని పేర్కొన్నారు. అయితే వచ్చిన వారు నకిలీ పోలీసుల గ్రహించి బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐలు శ్రావణ్‌కుమార్, సనత్‌రెడ్డి, వెంకటేష్‌లు బృందాలుగా విడిపోయి దొంగల ఆచూకీకి ప్రయత్నించగా శనివారం సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.11.50లక్షల విలువగల 115 గ్రాముల బంగారం, రూ.50వేల విలువగల 472 గ్రాముల వెండి, రూ10వేల నగదుతోపాటు దోపిడికి ఉపయోగించిన రెండు కార్లు, ఒకబైక్, పోలీస్ దుస్తులు, బేడీలను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్ఐలతోపాటు హెడ్‌కానిస్టేబుల్ పలువురు పోలీసులకు డీసీపీ నగదు రివార్డులను అందజేశారు. సమావేశంలో ఏసీపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

పెద్దపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి వివాహం చేసుకొని ఆరునెలల అనంతరం వద్దని చెప్పడంతో భర్త ఇంటి ఎదుట బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళన చేసిన సంఘటన పెద్దపల్లి మండలంలో చోటుచేసుకుంది. బొంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మేరపల్లికి చెందిన బోదాసు అభిషేక్ అదేగ్రామానికి చెందిన దండుగుల శ్రీలతను ఆరునెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. ఆరునెలలపాటు ఇద్దరు కలిసి పెద్దపల్లిలో నివసించినట్లు తెలిపారు. కొన్నిరోజుల క్రితం పెళ్లిచేసుకున్న వ్యక్తి తననువద్దని తెలుపడంతో ఇంటిఎదుట బైఠాయించినట్లు పేర్కొన్నారు. స్థానిక పెద్దలసమక్షంలో ఒప్పందం కుదుర్చుకోవడంతో గొడవ సద్దుమనిగినట్లు తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్‌రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ సెక్రెటరీ జెజె రత్నం ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీసంస్థలో 35నుంచి 40సంవత్సరాలు పనిచేసిన వారికి ఇబ్బందులు తపపడం లేదని తెలిపారు. 2017లో ఇవ్వాల్సిన పీఆర్‌సీ 2021లో ఇవ్వగా 2017నుంచి చెల్లిం చాల్సిన పీఆర్‌సీ ఏరియర్స్ ఇంతవరకు రాలేదని పేర్కొన్నారు. 2017లో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఎనిమిది సంవత్సరాలు గడిచినా ఇంతవరకు రాలేదన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీఅధికారులు చొరవ తీసుకోవాలని, ఆదుకోవాలని కోరారు.

గోదావరిఖనిలో గంజాయి విక్రయ ముఠా అరెస్టు

● 1.4కిలోల గంజాయి స్వాధీనం ● ఆరు సెల్‌ఫోన్లు సీజ్



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర బల్లార్ష నుంచి గోదావరిఖనికి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన చిక్కుడు రాహుల్, పవర్‌హౌస్‌కాలనీకి చెందిన కొప్పులసాయి ధనుష్, మంచికట్ల అక్షయ్, సప్తగిరి కాలనీకి చెందిన మాటూరి సాత్విక్, అంతర్గాం రాజాపూరంకు చెందిన చిలుక వినీత్, రామగుండం రైల్వే స్టేషన్ ఏరియాకు చెందిన బూక్య రాజేష్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వారు వినియోగిస్తున్న ఆరు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. స్థానిక కాకతీయనగర్‌కు చెందిన చిక్కుడు రాహుల్ కూలీ చేసుకుంటుండేవాడు. జల్సాలకు అలవాటు పడి బల్లార్ష నుంచి గంజాయి తీసుకువచ్చి గోదావరిఖని, ఇతర ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఈ క్రమంలో గోదావరిఖని, రామగుండంకు చెందిన యువకులతో పరిచయం ఏర్పడింది. వీరంతా గంజాయికి బానిసలై గంజాయి రవాణా, విక్రయాలు జరుపాలని నిర్ణయించుకున్నారు. మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయించేవారు. శుక్రవారం కాకతీయనగర్ వాటర్ ట్యాంకు వద్ద గంజాయి అమ్మకాలకు ప్రయత్నిస్తున్న చిక్కుడు రాహుల్‌ను పట్టుకుని అతని వద్ద 900గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో కొప్పుల సాయి ధనుష్, చిలుక వినీత్, మంచికట్ల అక్షయ్, మాటూరి సాత్విక్, బూక్య రాజేష్‌లను పట్టుకుని వారి వద్ద 500గ్రాముల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ రమేష్, క్రైమ్‌పార్టీ సిబ్బంది హెడ్‌కానిస్టేబుళ్లు రమేష్, శ్రీనివాస్, సదానందం, కానిస్టేబుళ్లు ప్రకాష్, రమేష్, మధుకర్, మధుసూదన్‌లను సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌లు అభినందించారు.

మృతిపై ఫిర్యాదు

ముత్తారం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సొన్నాయిల మధునయ్య(80) మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు కాసర్లగడ్డకు చెందిన అనుము రామస్వామి ముత్తారం పోలీసులకు శనివారం ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడి కుమార్తె మబ్బు స్నేహలత తండ్రి అనారోగ్యంతో బాధ పడుతున్నాడని ఈ నెల 14న ఆమె వెంట తీసుకెళ్లిందని, అదే రోజు సాయంత్రం మధునయ్య ఆరోగ్యం బాగాలేదని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నాడు. చికిత్స పొందుతూ మరణించాడని స్నేహలత తెలిపారని రామస్వామి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆయన మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ పోస్టుమార్టం జరిపించాలని మంథని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, తదితరులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కాలభైరవస్వామి, సంతాన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపిలు వేర్వేరుగా హాజరై స్వామివారి సన్నిధుల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హిందువులు హైందవ ధర్మం పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వేములవాడలో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. పురాతన దేవాలయాలు, హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషిచేయాలన్నారు. అంతకు ముందు ఆలయంలో యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, శివపార్వతుల కల్యాణం, స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దర్శనాలకు నిలయం.. భీమేశ్వరాలయం

● విశాలంగా ఆలయ ఆవరణ
● కోడెల మొక్కులు సులభతరం
● భక్తుల రద్దీకి అనువైన స్థలం
● రథశాలలోకి ఆర్జిత సేవల బుకింగ్ కార్యాలయం
● భీమేశ్వర సదన్‌లో అధికారిక కార్యకలాపాలు



భీమేశ్వరాలయంలో భక్తులు (ఫైల్)

ముఖ్య బుకింగ్ కౌంటర్

వేములవాడ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో విస్తరణ పనుల నేపథ్యంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయడంతో భీమేశ్వరాలయం భక్తులకు కేంద్రమైంది. ప్రస్తుతం భీమేశ్వరాలయంలో భక్తుల దర్శనాలు సులభం అవుతోంది. ఆలయంలో విశాలమైన ఆవరణ ఉండడంతో కోడెల మొక్కులు చెల్లించే భక్తులకు అనువుగా ఉంది. దీంతో స్పెషల్ కోడే, సాధారణ కోడె మొక్కులు చెల్లించే భక్తులకు ఇక్కట్లు తగ్గాయి. వేలాది మంది భక్తులు వచ్చినా దర్శనం చేసుకునే అవకాశం ఉంది.

● రథశాల వద్ద ముఖ్య బుకింగ్ కౌంటర్

భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలు నిర్వహించే భక్తులకు ముఖ్య బుకింగ్ కౌంటర్‌ను రథశాలకు మార్చారు. గత ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆర్జిత సేవలు చేసుకునే భక్తు లకు టికెట్ తీసుకోవడం గగనమైంది. బుకింగ్ కౌంటర్‌లో భక్తులు తోసుకోవడంతో క్యూలైన్ బారికేడ్ పక్కకు జరిగిపోయింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు రథశాల వద్ద ముఖ్య బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్‌లో అన్ని ఆర్జిత సేవల టికెట్లు తీసుకొని పూజలు చేసుకోవచ్చు.



ఉత్తరం వైపు ఏర్పాటు చేసిన రేకుల ఫెన్సింగ్

● భీమేశ్వర సదన్‌లో అధికార కార్యకలాపాలు

పాత భవనాలన్నీ తొలగించడంతో భీమేశ్వర సదన్‌లో అధికార కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గత నెల నుంచి సదన్ పైఅంతస్తులో ఈవో కార్యాలయం ఏర్పాటు చేశారు. కింది అంతస్తులో ఇంజనీరింగ్ కార్యాలయం ఏర్పాటు చేసి కార్యకలాపాలు సాగిస్తున్నారు. భీమేశ్వర గెస్ట్ హౌజ్-1లో ప్రోటోకాల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులో వీఐపీలు, ఇతర సిఫారసు లేఖలు ఉన్న వారు సంప్రదిస్తే దర్శనం ఏర్పాట్లు చేస్తారు. మరో భీమేశ్వర గెస్ట్ హౌజ్-3లోకి ప్రసాదాల తయారీ కేంద్రం ఏర్పరచి లడ్డూలు, పులిహోర ప్రసాదాలు తయారుచేస్తున్నారు.

పాఠశాలల మూసివేత తగదు

● కిష్టంపేట పాఠశాలను సందర్శించిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

చందుర్తి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలను మూసివేయడం తగదని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్రఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేట ఉన్నతపాఠశాలను మూసివేయడాన్ని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీబృందం సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండువేల జనాభా కలిగిన గ్రామంలో పాఠశాలకు రావలసిన వయసు కలిగిన విద్యార్థులు దాదాపు 200మంది వరకు ఉన్నప్పటికీ పాఠశాలలో విద్యార్థులు లేరని మూసివేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సందర్భంలో పాఠశాలలు మూసివేయమని గతంలో మూతబడిన పాఠశాలలను ఒక్క విద్యార్థి ఉన్న తెరుస్తామని వాగ్దానం చేశారు. కానీ గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో వేలాది పాఠశాలలను విద్యార్థుల సంఖ్య తగ్గిందని, విద్యార్థులు రావడంలేదని అనేక పాఠశాలలను మూసివేశారన్నారు. దీనిని విద్యాపరిరక్షణకమిటీ తీవ్రంగా నిరసిస్తున్నదన్నారు. ప్రస్తుతం కిష్టంపేట పాఠశాలలో అన్ని సౌకర్యాలు గదులు తగినంత మంది ఉపాధ్యాయులు ఉన్నందున జిల్లా విద్యాధికారి, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై అశోక్ కుమార్ సహ ప్రధాన కార్యదర్శి ఎం రఘుశంకర్‌రెడ్డి, కార్యదర్శి కే రవిచందర్, డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బూర సదానందం, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, ఉపాధ్యాయ ఐకాస జిల్లా కో-కన్వీనర్ విక్కుర్తి లక్ష్మీనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ కొమ్ము రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టంపేట పాఠశాలను సందర్శించిన రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ బృందం

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలోగల శేషప్ప కళావేదిక పై హైదరాబాద్ పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడిస్సి కూచిపూడి నృత్యప్రదర్శన శనివారం ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం పక్షాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారం పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూడిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించడానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ మాజీచైర్మన్ సంగనభట్ల దినేష్, ఆలయఈవో సంకటాలశ్రీనివాస్, వేదపండితులు, అర్చకుల చేతుల మీదుగా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గంటల తరబడి చిన్నారులచే నిర్వహించిన ఒడిస్సి కూచిపూడి నృత్యప్రదర్శనలను భక్తులు ఎంతో ఓపికతో తిలకించారు.

చిన్నారులను ఆలయం పక్షానచైర్మన్, ఈవో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదిత, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద దంపతుల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం

● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు నోటీసులు? ● ఇప్పటికే నిందితులను విచారించిన అధికారులు
● అప్పటి పోలీస్ అధికారులను విచారించే అవకాశం...

కోల్‌సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు గట్టు వామన్‌రావు, నాగమణి దంపతుల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసునమోదు చేసిన సీబీఐ విచారణ ప్రారంభించింది. రామగుండం పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా ఈ విచారణ జరుపుతున్నారు. వామన్‌రావు తండ్రి కిషన్‌రావు నుంచి వాంగ్మూలం తీసుకున్న సీబీఐ అధికారులు హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. రెండు మాసాలుగా వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న పలువురిని ఇప్పటికే విచారించింది. ఈ విచారణలో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధును విచారించాలని నిర్ణయించిన సీబీఐ ఆయనకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. పుట్టమధు సోమవారం గోదావరిఖనిలోని రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ప్రాంగణంలో సీబీఐ ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. సీబీఐకి చెందిన డీఎస్పీస్థాయి అధికారులు మధును విచారించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే మధును విచారించాల్సిన అంశాలపై నోట్ సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ కేసులో ఏ3గా ఉన్న పుట్ట మధు మేనల్లుడు బిట్టును సీబీఐ అధికారులు విచారించారు. న్యాయవాద దంపతులను 2021 సెప్టెంబరు 17న మంథని కోర్టు నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా మార్గమధ్యలో రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వచర్ల వద్ద నడిరోడ్డుపై హత్య చేశారు. ఈ కేసులో అప్పటి కమిషరేట్ అడిషనల్‌డీసీపీ(అడ్మిన్) అశోక్ కుమార్ విచారణాధికారిగా వ్యవహరించారు. అప్పటి రామగిరి ఎస్ఐ మహేందర్, విచారణ అధికారి అశోక్‌కుమార్‌ను సీబీఐ విచారించే అవకాశం ఉంది.

ఈ కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ఐజీ, పోలీస్ కమిషనర్ ఎప్పటికప్పుడు కేసు పురోగతిని సమీక్షించారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు జరుపుతుండడంతో ప్రాధాన్యం సంతరించుకున్నది. ఇప్పటికే ఫైళ్లను స్వాధీనం చేసుకున్న సీబీఐ పోలీస్ విచారణలోని లోపాలపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తుంది.

విద్యా బోధనకు దూరం చేసే కార్యక్రమాలను రద్దు చేయాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను విద్యా బోధనకు దూరం చేసే కార్యక్రమాలను ప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్‌టీచర్స్‌ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్రఅధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనిల్‌కుమార్ హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో పర్యవేక్షణకు డిప్యూటేషన్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించకూడదన్నారు. గత పీఆర్సీ గడువుముగిసి రెండేళ్లు గడుస్తున్న నూతన పీఆర్సీని ప్రకటించకపోవడం ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. హక్కుల సాధనకు నిర్వహించనున్న ఉద్యమాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని అనిల్ కుమార్ కోరారు. సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులు రామచంద్రం, శ్రీనివాస్,సతీష్, గంగయ్య, రమేశ్, శ్రీకాంత్, సురేందర్‌పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో కార్తీక పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. శనివారం ఆలయ ఈవో ఎల్. రమాదేవి, పట్టణ సీఐ వీరప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భీమేశ్వరాలయ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. శని, ఆదివారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. కోడె క్యూలైన్, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం, లడ్డు కౌంటర్, ప్రోటోకాల్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో భక్తులకు ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని ఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎల్లాగౌడ్, డీఈ మధు రఘునందన్, ఏఈవో శ్రావణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం..


భీమేశ్వరాలయంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు. మహిళలకు వాయినం అందజేశారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామివారల నిత్యకళ్యాణం జరిపించి పూజలుచేశారు. యమధర్మ రాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంవద్ద నాగదేవతకు, రావిచెట్టు ఆంజనేయస్వామివారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనేకమంది దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజించారు. స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు,అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం పక్షానఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.



ధర్మపురిలో భక్తుల రద్దీ



కొండగట్టులో భక్తులు

కొండగట్టులో భక్తుల సందడి..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం భక్తులతో సందడిగా మారింది. కార్తీకమాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

గోదావరి హారతి..

ధర్మపురి: కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరిహారతి 25వరోజు శని వారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి

కొండగట్టులో పెద్దపల్లి జిల్లా వాసి కిడ్నాప్

● తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు

● ముగ్గురిపై కేసు

మల్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన పెద్దపల్లి జిల్లాకు చెందిన దోమల రమేశ్ అనే వ్యక్తి కిడ్నాప్ కాగా తప్పించుకొని వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎల్కలపల్లికి చెందిన దోమల రమేశ్ అనే వ్యక్తి లోన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలల క్రితం గడ్డి నాగరాజు, బూర బాబులకు భూమిపై పెద్ద మొత్తంలో రుణం ఇప్పిస్తానని రూ.పది లక్షల మేర వసూలు చేశాడు. రుణం ఇప్పించకపోవడంతో ఐదు నెలలుగా తమ డబ్బులు ఇవ్వాలని కోరుతున్నప్పటికీ ఇవ్వడం లేదు. దీంతో బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన రమేష్‌ను నాగరాజు, బాబు కారులో వేములవాడకు తీసుకెళ్లారు. అక్కడ ముడికే అంజయ్య అనే మరో వ్యక్తితో కలిసి రమేశ్‌ను హైదరాబాద్‌కు తరలించి ఓ హోటల్లో బంధించి డబ్బులు ఇవ్వాలని దాడి చేశారు. అనంతరం రమేశ్‌ను శుక్రవారం రాత్రి వేములవాడకు తీసుకువచ్చి ఓ గదిలో ఉంచగా శనివారం అక్కడి నుంచి తప్పించుకొని మల్యాల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనను కిడ్నాప్ చేసిన నాగరాజు, బాబు, అంజయ్యపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

18న ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు సమావేశం

కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని షాదీఖానాలో ఈనెల 18న ఉదయం 11 గంటలకు ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల మసీదు ఈద్గా, ఖబ్రస్తాన్ మేనేజిమెంట్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ అజ్మతుల్లా హుస్సేన్ జిల్లా పర్యటన సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేశామని, దీనికి ఉమ్మడి జిల్లాల మసీద్, ఈద్గా, కబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల కరీంనగర్‌లో 2025-26 విద్యాసంవత్సరం పీజీ కోర్సుల్లో ఖాళీల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి ప్రకటనలో తెలిపారు. ఎంఏ(ఇంగ్లీష్), ఎంఏ (తెలుగు), ఎంకాం, ఎమ్మెస్సీ (బోటనీ), ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ(ఫిజిక్స్), ఎమ్మెస్సీ(జువాలజీ) కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో ఈనెల17వ తేదీ సోమవారం సాయంత్రం 5గంటలలోపు అందజేయాలని తెలిపారు. 18వ తేదీన సిపిగేట్-2025 నిబంధనలప్రకారం అర్హతలు ఉన్న వారికి సీటు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లో సీటులభించిన విద్యార్థినులకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించదని, నిర్ణీత ఫీజు కళాశాలలో చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

శ్రీరాంసాగర్‌కు స్థిరంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్‌భగీరథ, వరదకాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్‌గేట్ల ద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీకాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు ప్రారంభం

● ఉమ్మడి పది జిల్లాల నుంచి 330 మంది హాజరు
● పోటీలను ప్రారంభించిన డీఈవో శ్రీరామ్ మొండయ్య



యోగాసనాలు వేస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) యోగా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రామడుగు మండలం వెలిచాల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి అండర్-14, 17 బాలబాలికలు, మొత్తం 260 మంది క్రీడాకారులు, 60 మంది అధికారులు, 30మంది అఫీషియల్స్ హాజరయ్యారు. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ మొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగాను ఒక క్రీడగానే కాకుండా నిత్య జీవితంలో భాగంగా ప్రతీరోజు అభ్యాసం చేయాలన్నారు. యోగాతో ఆరోగ్యం, ఆనందం పొందుతామన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు కృషి చేయాలన్నారు. జాతీయస్థాయి యోగా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి భగవంతయ్య, ఎంఈవో రంగనాథ శర్మ, వెలిచాల పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్, పోటీల రాష్ట్ర పరిశీలకులు సతీష్, శ్రీనివాస్, జిల్లావ్యాయామ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ అధ్యక్షులు బాబు శ్రీనివాస్, నిర్వహణ కమిటీ బాధ్యులు వీర్ల హనుమంతరావు, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, వెలిచాల యూత్ సభ్యులు, నర్సింగరావు, స్థానిక ఫిజికల్ డైరెక్టర్ దత్తాద్రి శర్మ, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధారెడ్డి, బాధ్యులు శర్మ, కోచ్ రామకృష్ణ, ఎస్‌జీఎఫ్ సభ్యులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీని విజయవంతం చేయాలి'

జగిత్యాల అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ పిలుపు మేరకు 17న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు దూమాల గంగారాంలు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చెటుపెల్లి లక్ష్మణ్, బెజ్జంకి, బోనగిరి కిషన్, బొల్లె అనిల్, బెజ్జంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

●జగిత్యాల అర్బన్: రాజ్యాంగ హక్కుల సాధన సభకు ఈనెల 26న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా ఇన్‌చార్జి ఆసాది పురుషోత్తం పిలుపునిచ్చారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద హలో మాల చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పొనగంటి రాజయ్య, నాయకులు బత్తుల ప్రదీప్, చెనల్ల సుమన్, జవ్వాజి శంకర్, ఎలమాద్రి కిషోర్, కారం ఇంద్రయ్య, దాసరి బాబు, బైండ్ల రవి పాల్గొన్నారు.

'అర్హులందరికీ రుణాలు'

మల్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి మహిళాసంఘ సభ్యురాలికి బ్యాంకు రుణం అందించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నిజామాబాద్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీలత సూచించారు. మల్యాలలోని సెర్ప్ కార్యాలయంలో శనివారం మల్యాల యూబీఐ పరిధిలోని గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏజీఎం మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం రుణమేళా నిర్వహించడం జరుగుతుందని అందులో ప్రతి సంఘ సభ్యురాలికి రుణం అందించేలా వీవోఏలు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జగిత్యాల లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్, యూబీఐ మేనేజర్ పాషా, ఏపీఎం దేవరాజ్, సీసీలు కృష్ణమోహన్, చిన్న మల్లయ్య, గంగరాజం, అశోక్ సిబ్బంది లక్ష్మీనారాయణ, సరిత పాల్గొన్నారు.

'హుజూరాబాద్ సభకు తరలిరండి'

కథలాపూర్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : హుజూరాబాద్‌లో ఈనెల 19న బూత్ అధ్యక్షులు, కార్యదర్శులతో నిర్వహించనున్న సభకు కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

శబరిమలకు ఆర్టీసీ అద్దె బస్సులు

కొడిమ్యాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లుతున్న భక్తులకు జగిత్యాల డిపో నుండి ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇవ్వడానికి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ కండక్టర్ ముమ్మాడి లక్ష్మణాచారి శనివారం సాయంత్రం తెలిపారు. అధునాతనమైన ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ బస్సులను అనుభవం కలిగిన డ్రైవర్లతో శబరిమలకు నడుపటానికి ఏర్పాటు చేసామన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 9490680007లో సంప్రదించాలని కోరారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు

మెట్‌పల్లి టౌన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు అన్నారు. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని ఆయన అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మెట్‌పల్లి కోర్టు ఆవరణలో శనివారం జడ్జి స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇందులో పలు క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, భూమి, ప్రమాదాలు, చెక్‌బౌన్స్ కేసులకు సంబంధించిన 92 కేసులు పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి, ఏపీపీ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, సీఐ అనిల్ కుమార్, ఎస్ఐలు కిరణ్ కుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి యేగి జానకి అన్నారు. ధర్మపురి పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి యేగి జానకి మాట్లాడుతూ ఒక కేసులో రాజీ పడటం వల్ల ఇరు వర్గాలు ఆ కేసులో గెలిచినట్టే అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో 323 కేసులు పరిష్కరించారు. ఇందులో 2 సివిల్, 41 క్రిమినల్, 280 పెట్టి కేసులు ఉన్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ కుమార్, ఉపాధ్యక్షులు బందెల రమేష్, ట్రెజరరీ జాజాల రమేష్, ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు గడ్డం సత్యనారాయణరెడ్డి, రౌతు రాజేష్, దుమ్మెన శ్రీనివాస్, రామడుగు రాజేష్, గూడ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి


ధాన్యం తేమను పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులను త్వరిగతిన జరుపాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. శనివారం మండలంలోని రాఘవపేట గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం తేమను పరిశీలించారు. ముందుగా మండలంలోని కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ 40 మంది, 20 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు మండల కేంద్రంలో చెక్కులను అందజేశారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

మెట్‌పల్లి టౌన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే శక్తి అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. శనివారం మెట్‌పల్లిలోని ఐక్యూ మైండ్స్ సంస్థలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎండీ యాసీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజు అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకొని మూడు రోజుల పాటు నిర్వహించే విహారయాత్ర గురించి శనివారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలో మెట్‌పల్లి డిపో ఆర్టీసీ నుంచి కల్పిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న మధ్యాహ్నం 2 గంటల మెట్‌పల్లి బస్‌స్టేషన్ నుంచి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షరామం, సామర్లకోట ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడానికి పెద్దలకు రూ. 35000, పిల్లలకు రూ. 2500 టికెట్‌తో సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణం చేయవచ్చన్నారు. శుభకార్యాలకు, కుటుంబ సభ్యులు ప్రత్యేక టూర్ ప్యాకేజీలకు కూడా సంప్రదిస్తే బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు గూడూరు తిరుపతి, బొబ్బిలి రాజయ్య, రాజేందర్, రాజయ్య, చిలివేరి రవి, గుండు కృష్ణశేఖర్, సాదుల అనంత కిషన్, రాజు, ఉతుకం శ్రీనివాస్, రాజేశ్వర్, సిబ్బంది శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

'బిర్సా ముండా ఉద్యమస్ఫూర్తి అనుసరణీయం'


నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల అణచివేతకు, బ్రిటీషువారి అకృత్యాలకు, వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన బిర్సా ముండా ఉద్యమస్ఫూర్తి అనుసరణీయం అని జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాదగిరిబాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ చిన్ననాటి నుంచే ధైర్యసాహసాలు పునికిపుచ్చుకున్న ముండా పేదరికంలో జీవితం గడిపిన ఆదివాసీలపై జరుగుతున్న అణచివేతలపై తిరుగుబావుటా ఎగరవేశారన్నారు. ఆంగ్లేయుల రాకతో విచ్ఛిన్నమైన ఆదివాసీ రాజ్యాల దుస్థితి, అగ్రవర్ణాల దోపిడీపై ప్రశ్నించాడన్నారు. మిలినేరియన్ ఉద్యమం ప్రారంభించి నాయకత్వం వహించి 25ఏళ్ల ప్రాయంలోనే బ్రిటీషు సేనల కాల్పులకు నేలకొరిగిన వీరుడు బీర్సాముండా అని, ఆయన జీవితం,పోరాటం ఆదర్శనీయం అన్నారు. నేడు నరేంద్రమోదీ బీర్సాముండా ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్తూ 18వేల గిరిజన తండాలల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తూ, ఆదివాసులకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాధ్యులు నలువాల తిరుపతి, పిల్లి శ్రీనివాస్, గుంటుక శ్రీనివాస్, జుంబర్తి దివాకర్, సాంబారి కళావతి, ఓరుగంటి చందు, దొనికెల నవీన్, కొక్కుల గణేష్, కుమ్మరి తిరుపతి, ఇట్యాల రాము, జున్ను సంతోష్, భానుప్రియ, డాక్టర్ బనావత్ తిరుపతి, హపావత్ గంగాధర్, మాజీ ఎంపీటీసీ రాజేందర్, గుగులత్ జలపతి, బాణావత్ వంశీ, భూక్య దేవేందర్, భూక్యరాజు, అజ్మీరా రాజేందర్ తదితరులున్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

రాయికల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించడం పట్ల రాయికల్ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం అంగడి బజార్‌లో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కునారపు భూమేష్, బన్న సంజీవ్, ఉపాధ్యక్షులు అల్లె నర్సయ్య, కడార్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●**కథలాపూర్:** బీహార్‌లో బీజేపీ విజయం సాధించడంపై మండల కేంద్రంలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, బీజేవైఎం అధ్యక్షుడు ఆరె శివ, గాంధారి శ్రీనివాస్ ఉన్నారు.

కొనుగోళ్ల వివరాలను నమోదు చేయాలి

సారంగాపూర్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యం తూకం వేసిన వెంటనే వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని సహకార సంఘం దత్తత అధికారి స్వప్న అన్నారు. సారంగాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో నాగునూర్, లచ్చక్కపేట, రంగపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమే శనివారం పరిశీలించారు. ఈ సంద్భంగా కొనుగోళ్ళు వేగవంతం చేయాలని కొనుగోలు రైతులకు ఎలాంటి సమస్యలు ఇబ్బందులు కలగకుండ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఏమైన ఇబ్బందులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది భూమేష్, రైతులు, తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఎండపల్లి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఈఎన్‌టీ వైద్యులు రమణాచారి ఆధ్వర్యంలో మండలంలోని గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల అభివృద్ధికి రూ.15 వేలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను పరీక్షించి, పలువురు విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంసపూర్తిగా ఉన్న కాంపౌండ్ నిర్మాణం కోసం వైద్యులు రమణాచారి రూ.15 వేల చెక్కును మండల విద్యాధికారి హరికృష్ణ సమక్షంలో ప్రధానోపాధ్యాయుడు చందూరి రాజిరెడ్డికి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాలతి, ప్రశాంత్, కృష్ణారెడ్డి, శ్రీలత, ప్రీప్రైమరీ పోషకులు శిరిష, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సన్నద్ధం..

(ఐదో పేజీ తరువాయి)

వనరుల రంగానికి వివిధ స్కీంల కింద ఆర్థిక సహకారం అందించనుంది.

సిబ్బందికి శిక్షణకు ఏర్పాట్లు..

జిల్లాలో చిన్న నీటి వనరుల గణన కోసం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. మండల స్థాయిలోనే అధికారులకు శిక్షణ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారు. చీఫ్ ప్లానింగ్ అధికారి (సీపీవో) శాఖకు చెందిన వారు కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులకు సైతం ఈ గణన ప్రక్రియను పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ చైర్మన్‌గా, సీపీవో కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. గ్రామ పరిపాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ టెక్నీషయన్లు చిన్న నీటి వనరుల గణనను చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్వహించే నీటి వనరుల గణన వివరాలను ప్రతిరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం వాటిని ఉన్నతాధికారులకు అందించనున్నారు.

సూరమ్మ కాలువల పరిహారం చెల్లింపుపై సమావేశం


మాట్లాడుతున్న ఆర్డీవో జివాకర్‌రెడ్డి

కథలాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికోటలో శనివారం కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి సూరమ్మ కుడి, ఎడమ కాలువల్లో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లింపు కోసం రూ.42 కోట్లు విడుదల చేసిన నేపథ్యంలో పరిహారం చెల్లింపు ప్రక్రియ ప్రారంభించారు. అవార్డ్ ఎంక్వైరీ నిర్వహించి రైతులతో అభిప్రాయాలు సేకరించారు. ప్రభుత్వం కలికోటలో ఉన్న భూముల విలువ ప్రకారం ఎకరాన రూ.2.98 లక్షలు పరిహారం చెల్లించాల్సి ఉంది. నిబంధనల ప్రకారం మూడింతలు చేస్తూ రూ.9.19 లక్షలుగా నిర్ణయించారు. ఈ ధరపై రైతుల అభిప్రాయాలు సేకరించి నమోదు చేసుకున్నారు. భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న రైతులు పూర్తి వివరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, ఇరిగేషన్ అధికారులు, రైతులు ఉన్నారు.

నూతన భవనంలోకి మున్సిపల్ కార్యాలయం

రాయికల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) రాయికల్ పట్టణ మున్సిపల్ కార్యాలయం శనివారం నూతన భవనంలోకి మారింది. జగిత్యాల రోడ్‌లో ప్రస్తుతం అద్దె భవనంలో నిర్వహిస్తున్న కార్యాలయాన్ని తరలించేందుకు మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ పూజ నిర్వహించారు. సోమవారం నుంచి నూతన కార్యాలయంలో కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ వాహిని ఆధ్వర్యంలో దీపోత్సవం


దీపాలు వెలిగిస్తున్న భక్తులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక గీతా విద్యాలయంలో హిందూవాహిని ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ కొత్తకోట శివానందస్వామి, ప్రముఖ వక్తగా తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి ముడుపు యాదిరెడ్డితో పాటు, బీర్‌పూర్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ వొద్దిపర్తి సంతోషాచార్యులు హాజరై, జ్యోతిప్రజ్వలన చేసి దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎస్ ప్రముఖ్ డాక్టర్ భీమనాతి శంకర్, దీపోత్సవ కమిటీ బాధ్యులు వేముల సంతోష్, గాజుల సంతోష్, జిట్టవేణి అరుణ్‌కుమార్, గడ్డం వెంకటేష్, కైలాసపతి పాల్గొన్నారు.

నీటి వనరుల గణన పక్కాగా చేపట్టాలి

జగిత్యాల, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న చిన్న నీటి వనరుల గణన పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు. శనివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నిన్న నీటి వనరుల సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా లోని కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చిన్న తరహా నీటి వనరుల గణన ప్రతి ఐదు సంవత్సరాలకోసారి జరుగుతుందని 2 వేల హెక్టార్‌లలోపు ఆయకట్టు గల వనరుల గణన చేయడము జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం గణన ఎలాంటి పేపర్‌ను ఉపయో గించకుండా స్మార్ట్ ఫోన్ యాప్ ద్వారా పూర్తిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహించబడుతాయన్నారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా ప్రణాళికా ధికారి గుగ్గిల సత్యం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా క్రిస్టియన్ ఫెలోషిప్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జీవరత్నం

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా యునైటెడ్ క్రిస్టియన్ ఫెలోషిప్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జగిత్యాల సీఎస్ఐ వెస్లీ చర్చి పాస్టర్ రెవ.డా.ఆర్. జీవరత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్‌లో గల సీఎస్ఐ చర్చి కమ్యూనిటీ హాల్‌లో 200కు పైగా క్రైస్తవ పాస్టర్‌లు, నాయకులతో కలిసి అడహక్ కమిటీ సభ్యులు శనివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం 2025-27 వరకు కాలపరిమితి ఉంటుందని వారు వెల్లడించారు. ఉపాధ్యక్షులుగా పాస్టర్ ఏలియా మెంగు, పాస్టర్ శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ ఏ సిల్వాన్, కోశాధికారిగా పాస్టర్ ఆర్.గిద్యోన్, సహాయ కార్యదర్శులుగా పాస్టర్ గసికంటి సామ్యేల్, లాజర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సామ్యేల్ నాయక్, జిల్లా చీఫ్ అడ్వైజరీగా బ్రదర్ సతీష్‌కుమార్, జిల్లా అడహక్ కమిటీ సభ్యులుగా దయానంద్, ఏలియా, డేవిడ్, జెన్నీ, ప్రభుచరణ్‌లను గౌరవ సలహాదారులుగా నియమించుకున్నట్లు వారు తెలిపారు.

వృద్ధులకు ప్రభుత్వం ఆసరా

జగిత్యాలరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు ప్రభుత్వం ఆసరాగా ఉంటుందని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం హస్నాబాద్ శివారులో గల గాయత్రి వృద్ధాశ్రమంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాల సందర్భంగా తల్లిదండ్రుల పోషణ, రక్షణ సంక్షేమం చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాశ్‌రావు, సంక్షేమశాఖ సూపరిండెంట్ చంద్రమోహన్, ఫీల్డ్ ఆఫీసర్ కొండయ్య, వివిధసంఘాల ప్రతినిధులు బ్రహ్మయ్య, రాజ్‌గోపాల్‌చారి, రోహిణి, కరుణ పాల్గొన్నారు.

శివాజీ రైతు యువజన సంఘం కార్యవర్గం

రాయికల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ శివాజీ రైతు యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంబాల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్య దర్శిగా జిల్లాల పెద్ద మల్లారెడ్డి, కోశాధికారిగా కడపటి రాజేందర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. అలాగే దడువతిదారుగా జిల్లాల గంగారెడ్డి, బర్ల పెద్ద మనిషిగా దమ్మ గంగారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కుర్మ రాజేందర్, జిల్లాల కాంగ్రెస్ రెడ్డి ఎన్నికయ్యారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లత

కొడిమ్యాల, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిబంధనలు పాటించాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శనివారం కొడిమ్యాల మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రానికి ఎంత మంది రైతులవి ఎన్ని కుప్పలు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని తేమ శాతం చూసి తూకం వేసిన వెంటనె రైస్ మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మిల్లులకు ఎంత ధాన్యం పంపించారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట సీవిల్ సప్లై డీఎం జితేంద్రప్రసాద్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఏపీఎం మల్లేశం, సీసీ స్వరూప వీవోఏ రమ, కమిటీ సభ్యులు, రైతులు ఉన్నారు.

●**మల్యాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):** వరి ధాన్యం కొనుగోల్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మండలంలోని ముత్యంపేట, కొండగట్టు లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో శనివారం కొనుగోల్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యంను అదే రోజు రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రైతులకు 48గంటలలోగా ధాన్యం చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. హమాలీల సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని నిర్వహకులకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట సివిల్‌సప్లై డీఎం జితేంద్రప్రసాద్, తహసీల్దార్ వసంత, ఆర్ఐ తిరుపతి, సీఈవో శ్రీనివాస్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య కోరారు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో తిమ్మాపూర్, రాయపట్నం, పాశిగాం, వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మపురి అడాప్షన్ అధికారి రాము, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, తిమ్మాపూర్ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గటికె సత్తయ్య, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ వావిలాల ప్రకాష్, మాజీ ఎంపీటీసీ కాళ్ల సత్తయ్య, ఇంచార్జ్ సీఈవో వేణు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లారీలను త్వరగా పంపాలి

మల్లాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు జరిగిన మొక్కజొన్నలను త్వరగా మార్క్‌ఫెడ్ అధికారులు తరలించాలని ఇందుకు అవసరమైన లారీలను అధికారులు సమాకూర్చాలని జిల్లా కిసాన్‌సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి కోరారు. శనివారం మల్లాపూర్‌లోని ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు కేంద్రాల్లోని పలు సమస్యలను జలపతికి వివరించారు. ఆయన వెంట నాయకులు మల్లయ్య, రమేష్, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, సోమయ్య, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఇబ్రహీంపట్నం, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్దండి, మూలరాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ వరప్రసాద్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తూకం వేసే యంత్రాలను పరిశీలించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ రమేష్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

కొడిమ్యాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శనివారం ఆలయ మండపంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు ఆవిష్కరించారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి ప్రతిష్ఠ జరిగి రెండు సంవత్సరాలు గడుస్తున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని నవంబరు 23, 24, 25, 26లలో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. 25న మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం, 26న బుధవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, అర్చకుడు నాగరాజు రమేష్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

-బయటకు రావడానికి జంకుతున్న జనం


గాంధీ రోడ్డులో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

కోరుట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని పలు వార్డులలో వీధి కుక్కల స్వైరవిహారంతో వీధుల్లోకి రావడానికి జనం జంకుతున్నారు. పట్టణ శివారు కాలనీలలో కుక్కలు స్వైరవిహారం చేస్తుండగా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేయడం విమర్శలకు తావిస్తోంది. గడిచిన నెలలో 150 వరకు కుక్క కాట్లు ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదు కాగా ప్రైవేట్ ఆసుపత్రిలో ఇంకా ఎక్కువ నమోదు అయి ఉన్నాయి. పట్టణంలో 33 వార్డులు ఉండంగా అందులో సుమారు 20 వార్డులలో వీది కుక్కల సంచార ఎక్కువగా ఉన్నట్లు గతంలో మున్సిపల్ అధికారులు గుర్తించారు.

అర్బన్ కాలనీ, మాదాపూర్, అల్లమయ్య గుట్ట, ఏసీకోని గుట్ట ప్రాంతాలలో పరిస్థితి మరి దారుణంగా ఉంది. ఇటీవల ఓ ఇంట్లోకు వెళ్లిన వీధి కుక్క అడ్డు వచ్చిన చిన్న పిల్లవాడితో నలుగురు కుటుంబ సభ్యులను కరవడంతో ఆసుపత్రి పాలయ్యారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో రాత్రి సమయాల్లో ఒంటరిగా వస్తున్న వారిపై కుక్కలు దాడులు చేయడంతో ఆ ప్రాంతానికి వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. అయిలాపూర్, కల్లూర్ రోడ్డులలో ఉదయం సమయంలో వందల సంఖ్యలో కుక్కలు ఉండడంతో ఆ ప్రాంతంలో వాకింగ్ వెళ్లేవారు భయానికి లోనవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వీధి కుక్కలను పట్టణం నుంచి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.